

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



క్రీడల అభివృద్ధికి తోడ్పాటు

క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /15.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

తపాలా కార్యాలయాలకు భవనాలు మంజూరు

సుభాష్‌నగర్: జిల్లాలోని భీమ్‌గల్, నందిపేట్, బాల్కొండ మండల కేంద్రాల్లో తపాలా కార్యాలయాలకు భవనాలు మంజూరయ్యాయి. ఈమేరకు కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురికి లేఖ ద్వారా తెలియజేశారు. ఇటీవల పోస్టాఫీస్ భవనాల మంజూరు కోసం ఆయా మండలాల ప్రజలు ఎంపీ అర్వింద్‌ను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. వీరి విజ్ఞప్తులపై స్పందించిన ఎంపీ అర్వింద్ నూతన భవనాల మంజూరు కోసం సంబంధిత మంత్రికి లేఖ రాశారు. ఎంపీ విజ్ఞప్తులను పరిశీలించిన కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా నందిపేట్, బాల్కొండ, భీంగల్ మండల కేంద్రాల్లో నూతన తపాలా కార్యాలయాల భవనాలను మంజూరు చేస్తున్నట్లు లేఖ ద్వారా తెలియజేశారు. తన విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించి, తక్షణమే భవనాలు మంజూరు చేసిన మంత్రి సింధియాకు ఎంపీ ధన్యవాదాలు తెలియజేశారు.

మున్సిపల్ సీసీగా రాకేశ్



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ క్యాంపు క్లర్క్ (సీసీ)గా రాకేశ్‌ను నియమిస్తూ సోమవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాకేశ్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మహ్మద్ ఇర్ఫాన్‌ను కమిషనర్ చాంబర్‌లో క్లర్‌గా, కె నరేశ్‌ను కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించారు. ఇదివరకు సీసీగా విధులు నిర్వహించిన మహ్మద్ అంజాద్ ఖాన్‌ను తిరిగి నందిపేట తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా సరెండర్ చేశారు. అంజాద్ ఖాన్‌ను గతంలోనే వెనక్కి పంపినా ఆయన ఇక్కడే పనిచేస్తుండటంపై సాక్షి కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ తాజాగా ఆయనను తప్పించారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ



ఖలీల్‌వాడి: జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ సూచించారు. జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నెలవారీ సమీక్షలో ఆమె మాట్లాడారు. మహిళల భద్రత కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి మొదలగు వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. లాడ్జీలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రిపూట వాహనాల తనిఖీ చేసి, దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్లు కోటేశ్వరరావు (అడ్మిన్), బస్వారెడ్డి (ఎల్అండ్‌వో), ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.


ఓపెన్ స్కూల్ పరీక్ష ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 14 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ కౌంటింగ్, జవాబు పత్రాల కోసం ఇంటర్మీడియట్ వారు రూ.400, పదో తరగతి వారు రూ.350 ఫీజు చెల్లించాలని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం ఇంటర్, పదో తరగతి విద్యార్థులు రూ.1200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థులు ఈ నెల 18 వరకు వార్షిక ఫీజు చెల్లించాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు, రూ.500 అదనపు రుసుంతో డిసెంబర్ 21వరకు ఫీజు చెల్లించవచ్చని వివరించారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు.

ఉద్యోగం ఉంటుందో.. ఊడుతుందో!



- ఆందోళన చెందుతున్న కొందరు కొత్త టీచర్లు
- డీఎస్సీ నియామకాల్లో అనేక లోపాలు
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న తప్పిదాలు
- అనర్హులకు ఉద్యోగం ఇచ్చారు.. ఫిర్యాదులతో తొలగిస్తున్నారు..



జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

డీఎస్సీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో అనేక లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఎంపిక విధానం ఆన్‌లైన్ పద్ధతిలో జరగ్గా ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి కారణంగా తప్పిదాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగ నియామకం చేసిన తర్వాత తొలగించడం, అర్హులైన వారికి ఉద్యోగం రాకపోవడం లాంటి తీవ్ర ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఎంపిక జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కేడర్ ఎంపిక ప్రక్రియలో అనేక లోపాలు ఎదురుకాగా అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నవారు కూడా కొందరు తమ ఉద్యోగం ఉంటుందా.. ఊడుతుందా అని ఆందోళన చెందుతున్నారు.

నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ ఫలితాలు సెప్టెంబర్ 30న విడుదల చేశారు. అక్టోబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందిస్తారన్న నేపథ్యంలో, జిల్లా విద్యాశాఖ ఆగమేఘాల మీద ఎంపిక ప్రక్రియ చేపట్టింది. 640 పోస్టులకు గాను 452 మందిని ఎంపిక చేశారు. మిగతా పోస్టులలో వివిధ కారణాలు చూపెడుతూ భర్తీ చేయలేదు. అనంతరం అభ్యర్థుల ఫిర్యాదుల మేరకు పోస్టులను భర్తీ చేస్తూ వస్తున్నారు. ఈ ఘటనలో అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయి.

మచ్చుకు కొన్ని..

కమ్మర్పల్లి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన కృష్ణ చైతన్యకు సాంఘిక శాస్త్ర విభాగంలో వికలాంగుల కోటలో 780 ర్యాంకు వచ్చింది. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే ఎంపిక జాబితాలో ఇతనికి బదులు 900 ర్యాంకు వచ్చిన వ్యక్తికి ఉద్యోగం కల్పించారు. కృష్ణ చైతన్య విద్యాశాఖ అధికారులకు మొరపెట్టుకోగా ధ్రువపత్రాలు పరిశీలకు హాజరు కాలేదని చెప్పారు. వాస్తవానికి ఇతను హాజరయ్యాడు. అధికారులు పున: పరిశీల చేసి ఉద్యోగం కల్పించారు.

- ఉర్దూ మీడియంలో ఓ అభ్యర్థి ఈ ఏడాది జనవరిలో డైట్‌లో ఉత్తీర్ణత సాధించింది. జూన్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఈమె ఉద్యోగానికి అర్హురై ఉండి ఎంపిక కాలేదు. మళ్లీ పరిశీలించి ఎంపిక చేశారు.
- ఓపెన్ కేటగిరి విభాగంలో తబస్సుమ్ 70 ర్యాంకు సాధించింది. అయితే 71 ర్యాంకు వచ్చిన అభ్యర్థిని ఎంపిక చేశారు. తబస్సుమ్ విద్యాశాఖ కార్యాలయంలో తెలియజేయగా పరిశీలన చేసి మళ్లీ ఎస్టీటీ విభాగంలో ఈమెకు ఉద్యోగం కల్పించారు.
- ఆశియా ఫిర్దోస్‌కు ఎస్జీటీ విభాగంలో సెకండ్ లాంగ్వేజ్ హిందీ ఉంది. ఈమె 52.87 మార్కులతో రెండవ ర్యాంకు సాధించింది. ఈ విభాగంలో ఒక్క పోస్టు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంది. ఈమె ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైంది. ఈమెకు బదులు నిర్మల్ జిల్లాకు చెందిన సెకండ్ లాంగ్వేజ్ తెలుగు ఉన్న వ్యక్తిని ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఫిర్యాదు మేరకు పోస్టును నిలుపుదల చేశారు.
- సతీష్ వికలాంగుల కోటలో హిందీ సబ్జెక్టులో ఎంపికయ్యారు. ఇతను విశారాద్ కోర్సు పూర్తి చేశాడు. ఇది డిగ్రీతో సమానం. హిందీ లాంగ్వేజ్‌లో పీజీ చేశాడు. ధ్రువపత్రాల పరిశీల సమయంలో అధికారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. అయితే 1:1 జాబితాలో ఇతన్ని ఎంపిక చేయలేదు. విద్యాశాఖ కార్యాలయంలో ధ్రువ పత్రాల పరిశీలలో ధ్రువ పత్రం చెల్లదన్నారు. తీరా మళ్లీ ఫిర్యాదు చేయడంతో అతను సమర్పించిన ధ్రువత్రాలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించి ఉద్యోగం కల్పించారు.
- స్కూల్ అసిస్టెంట్ విభాగంలోని భౌతిక శాస్త్రంలో ప్రవీణ్ మూడో ర్యాంకు సాధించారు. మొదట ఉద్యోగం ఇచ్చి తొలగించారు.

జూన్ తర్వాత బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు కాదని విద్యాశాఖ ఇతని ఉద్యోగాన్ని నిలుపుదల చేసింది. నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్‌లో బీఈడీ పూర్తి చేసిన వారు కూడా అర్హులే. మళ్లీ ఇతని ఫిర్యాదు పరిశీలించిన అధికారులు ఉద్యోగం కల్పించారు.

పోస్టింగ్ లేదంటున్నారు..

- డీఎస్సీలో నియామక పత్రం అందుకున్న అభ్యర్థిని ఆవేదన



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన నవత

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీ ఫలితాలలో నియామక పత్రం అందుకున్న జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్డు కాలనీకి చెందిన ఊట్ల నవత పోస్టింగ్ కోసం డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె కన్నీరు మున్నీరవుతున్నారు. నవత ఎస్టీటీ లోకల్ బాడి విభాగంలో 203 ర్యాంక్ సాధించి పోస్టుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 9న ముఖ్యమంత్రి నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. రిపోర్టింగ్ కోసం అక్టోబర్ 11న డీఈవో కార్యాలయానికి వెళ్లగా సాంకేతిక కారణాలు చెబుతూ ఆమెకు పోస్టును కేటాయించలేదు. ఇప్పుడు ఉద్యోగం లేదంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఈవోను వివరణ కోరగా స్పందించడం లేదని ఆమె వాపోయారు. బాధితురాలు సోమవారం ప్రజావాణికి వచ్చి కలెక్టర్, డీఈవోకు వినతిపత్రం అందించారు.

“ నిబంధనలు పాటించలేదు



డీఎస్సీ నియామకాల ప్రక్రియ ఆగమేఘాలపై చేపట్టారు. చాలామందికి పోస్టులను కేటాయించలేదు. నిబంధనలను సక్రమంగా చూసుకోకుండా భర్తీ చేయడం సరైనది కాదు. ఇది వరకే మేము రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ అధికారులను కలిసి విన్నవించాము. కోర్టును ఆశ్రయించడంతో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేశారు.

– కేశాపురం రమేశ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

ట్రిపుల్ ఐటీలో మరో విషాదం



స్వాతిప్రియ(ఫైల్)



ట్రిపుల్ ఐటీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న మృతురాలి తల్లి ఉజ్వల

- హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న జిల్లా విద్యార్థిని
- తమ కూతురును చంపేశారని తల్లి ఆరోపణ
- వ్యక్తిగత కారణాలతోనని అధికారుల ప్రకటన

భైంసా/బాసర: బాసరలోని ట్రిపుల్ ఐటీలో మరో విద్యా కుసుమం రాలిపోయింది. పీయూసీ2 చదువుతున్న ఆర్మూర్ మండలం పెర్కిట్‌లోని తిరుమల కాలనీకి చెందిన పూరి స్వాతి ప్రియ(18) ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు ట్రిపుల్ ఐటీకి చేరుకున్నారు. వారిని సెక్యూరిటీ అధికారులు ప్రధాన గేటు వద్దనే నిలిపివేశారు. పుట్టెడు దుఃఖంతో వచ్చిన తల్లిదండ్రులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

తల్లిదండ్రులు రాకముందే తరలింపు..

స్వాతిప్రియ రోజూ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేది. సోమవారం ఉదయం క్యాంపస్ అధికారులు ఫోన్ చేసి స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకుందని తెలుపడంతో వారు షాక్ అయ్యారు. గంటలోపే బాసరకు చేరుకున్నారు. అయితే తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని క్యాంపస్ నుంచి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తల్లి ఆరోపణలు

స్వాతిప్రియను క్యాంపస్ అధికారులే హత్యచేసి ఆత్మహత్యగా చెబుతున్నారని మృతురాలి తల్లి ఉజ్వల ఆరోపించారు. తాము రాకముందే మృతదేహాన్ని ఎందుకు తరలించారని ప్రశ్నించారు. ట్రిపుల్ ఐటీకి చేరుకున్న తమను లోపలికి ఎందుకు అనుమతించలేదని నిలదీశారు. కూతురు సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని, సూసైడ్ నోట్ ఉందని చెప్పిన అధికారులు దానిని చూపించలేదన్నారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునే అవకాశమే లేదన్నారు. ఆదివారమే తమతో ఫోన్‌లో మాట్లాడిందని ఉదయాన్నే ఎలా చనిపోయిందని ప్రశ్నించారు. క్యాంపస్ అధికారులు సాక్ష్యాలను మాయంచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తీవ్రంగా ఆరోపించింది.

పోలీసుల లాఠీచార్జి

విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు క్యాంపస్‌ను ముట్టడించారు. గేట్లవైపు వెళ్తున్న వారిని పోలీసులు, సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఈ ఘటనలో ఏబీవీపీ నాయకుడు సాయి కుమార్ తలకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స కోసం నిజామాబాద్ తరలించారు.

భారీ భద్రత

స్వాతిప్రియ వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకుందని క్యాంపస్ అధికారులు ప్రకటించారు. ట్రిపుల్ ఐటీ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులను మోహరించారు. ఎవరినీ లోనికి అనుమతించలేదు. విద్యార్థిని స్నేహితులను కూడా బంధువులతో మాట్లాడించేందుకు నిరాకరించారని సమాచారం.

ఇంటి వద్ద..



ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన స్వాతిప్రియ(18) బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడటంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. బిచ్కుంద మండలం పూరి రవి, ఉజ్వల దంపతులు 14 ఏళ్ల క్రితం ఉపాధి కోసం పెర్కిట్‌కు వలస వచ్చారు. వీరికి సరస్వతి, స్వాతిప్రియ, ఓం సాయిరాం పిల్లలు ఉన్నారు. రవి ప్రైవేట్ ఆస్పత్రులకు ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో అమ్మాయి స్వాతిప్రియ బాసర ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతోంది.

బాసర ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతోంది ?



సాయిని పరామర్శిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ నాగారం: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య నేపథ్యంలో ఆందోళన చేసిన ఏబీవీపీ కార్యకర్తలపై ప్రైవేట్ సెక్యూరిటీ కర్రలతో దాడులు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సీఐ రాకేష్ అండదండలతోనే విద్యార్థులపై దాడి జరిగిందన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఏమి జరుగుతుందో బయటకు తెలియాలన్నారు. లాఠీచార్జిలో గాయపడిన కార్యకర్త సాయికుమార్‌ను సోమవారం సాయంత్రం జీజీహెచ్‌కు తరలించగా ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయికుమార్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో రెండు, మూడు నెలలకు ఒకసారి ఆత్మహత్య ఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మహత్యల వెనుక ఉన్న కారణాలను నిర్ధారించడానికి కమిటీ వేయాలన్నారు. లాఠీచార్జి చేసిన పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ ప్రముఖ్ రెంజర్ల నరేష్, న్యాయవాది జగన్‌మోహన్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, శ్రీకాంత్, ఆనంద్, పవన్, హరీష్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగుల నిరసన



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రెవెన్యూ శాఖ ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌తో సహా తహసీల్దార్ ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు సోమవారం సాయంత్రం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ కలెక్టర్, ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన అధికారులపై దాడి చేయడం శోచనీయమని ఆక్షేపించారు. రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కలెక్టర్ సీసీ మహేశ్, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేస్తే.. ఇల్లు గుల్లే

- జిల్లాలో రెచ్చిపోతున్న దొంగలు
- మహారాష్ట్ర ముఠాగా అనుమానం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



సీసీ ఫుటేజీలో దుండగుల కదలికలు (ఫైల్)

ఖలీల్‌వాడి: జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్తే గుల్ల చేస్తున్నారు. నగరంతోపాటు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇటీవల చోరీ కేసులు పెరిగాయి. దీంతో జిల్లాకు మళ్లీ మహారాష్ట్ర దొంగల ముఠా వచ్చిందని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కీ నిర్వహించిన దొంగలు తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తున్నారు. ఇవి మహారాష్ట్ర ముఠా పనులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల జరిగిన చోరీ కేసుల్లో సీసీ ఫుటేజీలను గుర్తించినట్లు తెలిసింది. చోరీ చేసిన వెంటనే జిల్లా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు వెళ్లడానికి అవకాశాలు ఉండటంతో రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లతో పాటు ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకొని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. నిందితులన పట్టుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. కాగా చోరీ జరిగితే ఘటన స్థలాన్ని పరిశీలించే పోలీసులు సొమ్ము రికవరీ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సాంకేతికతతో నియంత్రణ

చోరీల నివారణకు ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. సాంకేతికను వినియోగించుకొని దొంగల నుంచి కాపాడుకోవాలని చెబుతున్నారు.

మోషన్ డిటెక్టర్ : ఇది మార్కెట్‌లో, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. ఇంటిఇకి వచ్చిన దొంగ తాళం పగలగొట్టేప్పుడు ఫోన్‌కు మెసేజ్ తోపాటు సౌండ్ వస్తుంది. దీంతో స్థానిక పోలీసులను అప్రమత్తం చేయవచ్చు. దీంతోపాటు దొంగల ఫొటోను కూడా తీస్తుంది.

కంట్రోల్ లాక్ : ఇంటి తలుపులకు ఈ లాక్ వేసి పైన తాళం వేస్తే దొంగల నుంచి కాపాడుకోవచ్చు. ఇది వేస్తే తాళం పగులగొట్టిన తలుపును తీయడానికి వీలు ఉండదు.

లాకర్: ప్రతి ఇంట్లో వారి స్థోమత మేరకు లాకర్ ఏర్పాటు చేసుకోవాలి. లాకర్ బరువుగా ఉండటంతో దానిని ఎత్తుకెళ్లే వీలు ఉండదు. దాని తాళం పగులగొట్టే అవకాశం ఉండదు.

సీసీ కెమెరాలు : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. సీసీ కెమెరాలు ఉంటే దొంగల కదలికలు నమోదై పట్టుకోవడానికి సులువు అవుతుంది. కాలనీలు, ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకువాలని పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన పలు చోరీలు

- అక్టోబర్ 14న బోధన్‌లోని ఆచన్‌పల్లిలో వెంకటేశ్వర్‌రావు ఇంట్లో రూ.50 లక్షల నగదు, 20 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- అక్టోబర్ 13న నగరంలోని వినాయక్‌నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. అదే రోజు న్యూఎన్జీవో కాలనీలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంటికి వెళ్లి మెడలోనుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- అక్టోబర్ 16న నగరంలోని సీతారాం నగర్ కాలనీలో ఓ ఇంట్లో బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ముగ్గురు దొంగలు వచ్చినట్లు పోలీసులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. అదేరోజు వర్నిలో మూడు దుకాణాల్లో చోరీ జరిగింది.
- అక్టోబర్ 24న బడా భీమ్‌గల్‌లో చిత్తర లక్ష్మి ఇంట్లో మూడున్నర తులాల బంగారంతోపాటు నగదును చోరీ చేశారు.
- ఈ నెల 3న నగరంలోని నాందేవాడకు చెందిన దత్తాద్రి ఇంట్లో 3 తులాల బంగారు ఆభరణాలు, నగదు పోయింది.
- ఈ నెల 5న నగరంలోని వరణ్య మెడికల్ షాప్ షట్టర్లు పగులగొట్టిన దొంగలు రూ.5 లక్షల నగదు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 9న కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో నాయిని పురుషోత్తం ఇంట్లో 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

నగరంలో భారీ చోరీ

- వృద్ధ దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగానే ఘటన
- 32 తులాల బంగారం.. రూ.2.50 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్ 100 ఫీట్ రోడ్డు సమీపంలోని దత్తాత్రేయ గుడి వద్ద గల ఓ ఇంట్లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రచ్చరసు రాములు, లక్ష్మి దంపతులు ఆదివారం రాత్రి ఇంట్లో పడుకున్నారు. కిటికీ గ్రిల్స్ తీసుకొని నలుగురు దొంగలు లోనికి చొరబడ్డారు. 32 తులాల బంగారం, కిలో వెండి, రూ.2.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం లేచి చూసిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అదే ప్రాంతంలోని మరో ఇంట్లో సైతం దొంగలు చోరీకి యత్నించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు.



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

గణేశ్‌నగర్‌లో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని గంగాస్థాన్ గణేశ్‌నగర్ కాలనీలో యోగా శిక్షకురాలు అమీనా ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ సోమవారం తెలిపారు. ఆ నెల 6న అమీనా హైదరాబాద్ వెళ్లారు. ఆమె ఆదివారం రాత్రి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. దొంగలు ఇంట్లోకి చొరబడి తులం బంగారం, పది తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

“ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం

దొంగల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. త్వరలో పట్టుకుంటాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

క్లుప్తంగా

వారం రోజుల్లో బోనస్ జమ



వేల్పూర్: సన్నరకం ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ జమవుతాయని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోనస్ కోసం రైతులు ఆందోళన చెందొద్దన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఐడీసీఎంఎస్, ఐకేపీ ద్వారా 660 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, 510 కేంద్రాల్లో సన్నరకం వడ్లు కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు సుమారు లక్ష క్వింటాళ్ల సన్నరకం, అరవై వేల క్వింటాళ్ల దొడ్డురకం వడ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. అలాగే కామారెడ్డి జిల్లాలో 70 వేల క్వింటాళ్ల సన్నరకం, 40 వేల క్వింటాళ్ల దొడ్డురకం వడ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు.

ట్రాఫిక్ డైవర్షన్‌తో ఇబ్బందులు



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు నెల రోజులపాటు రోడ్డును మూసివేసిన విషయం తెలిసిందే. మానిక్‌బండార్ చౌరస్తా నుంచి అర్గుల్, మదన్‌పల్లి మీదుగా డిచ్‌పల్లి హైవేపైకి వాహనాలు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. అలాగే చిన్నాపూర్ కమాన్ నుంచి కల్లెడి, ఆలూర్ మీదుగా ఆర్మూర్‌వైపు వాహనాలు వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే సింగిల్ రోడ్ల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండపోయింది. వాహనాలు వేగంగా వెళ్తున్నాయని, పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ సోమవారం ఉదయం నుంచి అడవి మామిడిపలి, అర్గుల్ రహదారులపై పర్యటించి వాహనదారులకు పలు సూచనలు చేశారు.

క్రీడల అభివృద్ధికి తోడ్పాటు

- మానసిక, శారీరక ఉల్లాసానికి ఆటల పోటీలు దోహదం
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి
- అట్టహాసంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



వాలీబాల్ షాట్ కొడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు అందులో భాగమేనని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల 10వ జోనల్ క్రీడా పోటీలు మండలంలోని కంజర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. జాతీయ, సొసైటీ, స్పోర్ట్స్ జెండాలను నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల స్వాగతోత్సవ నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంజర గురుకులంలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లా నుంచి మలావత్ పూర్ణ, నిఖత్ జరీన్ తదితరులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. బాలికల విద్య సమాజానికి కీలకమని, ప్రభుత్వం ఇటీవల మెస్, కాస్మొటిక్ చార్జీలను 40శాతం పెంచిందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు, తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములు నాయక్, ఎంఈవో గేమ్‌సింగ్, సంస్థ డిప్యూటీ సెక్రెటరీ వనజ, ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు

నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల నుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో 1200 మంది క్రీడాకారిణులు అండర్–14, 17, 19 విభాగాల్లో పాల్గొననున్నారు. నాలుగు జిల్లాల్లోని 14 గురుకులాల నుంచి 9 అంశాల్లో క్రీడలు నిర్వహించనున్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

క్రీడల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురుకులం మొత్తం కలియతిరిగారు. డైనింగ్ హాల్, హాస్టల్, తరగతి గదులు, వెల్‌నెస్ సెంటర్, ఇతర అన్ని విభాగాలను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యాప్రమాణాలు, విద్యార్థినుల స్థితిగతుల గురించి ప్రిన్సిపాల్ విజయ లలిత, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కళాశాలలో విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, తాగునీటి ఇబ్బంది, డ్రెయినేజీ, తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నెల రోజుల్లో తాగునీటి సరఫరాకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీనిచ్చారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే



మార్చ్‌పాస్ట్‌లో లెఫ్ట్‌పోచంపాడ్ గురుకులం క్రీడాకారిణులు



కంజర గురుకులం క్రీడాకారిణులు..

ఇద్దరికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు

నిజామాబాద్ సిటీ/తెయూ(డిచ్‌పల్లి): జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు మహ్మద్ అలీఖాన్, తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ ఖవి ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అబుల్ కలాం జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి అవార్డులు అందజేశారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని ప్రతి ఏడాది మహబూబ్ హుస్సేన్ జిగర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందిస్తుండగా, ఈ సంవత్సరం జిల్లాకు చెందిన ప్రముఖ జర్నలిస్టు అహ్మద్ అలీఖాన్‌కు దక్కింది. ఉర్దూ జర్నలిజంలో 30 ఏళ్లుగా ఆయన సేవలందిస్తున్నారు. 'పరిశోధన – విమర్శ' రంగంలో తెయూ ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్దుల్ ఖవికి అవార్డు దక్కింది. అబ్దుల్ ఖవి తన పీహెచ్ పరిశోధన నిమిత్తం లండన్ నగరంతో పాటు ఇతర యూరోపియన్ దేశాలలో వార్త పత్రికలలో తీరుతెన్నులపై అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన చేశారు. అనేక ప్రముఖ ఉర్దూ పత్రికలకు సీనియర్ జర్నలిస్ట్ గా పని చేశారు. పలు సాహితీ విమర్శ ఆర్టికల్స్ ప్రచురించారు. గతంలో అబ్దుల్ ఖవి ఉర్దూ అకాడమీ ద్వారా ఉత్తమ అధ్యాపకుడి అవార్డు కూడా అందుకున్నారు. ఆయనను వీసీ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ ఖవి



అవార్డు అందుకుంటున్న జర్నలిస్ట్ ఏకే ఖాన్

ప్రజావాణికి 70 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు, అడిషనల్ కలెక్టర్లు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, బోధన్ ఏసీపీ పీ శ్రీనివాస్ ఫిర్యాదులు స్వీకరించారు. వైద్యారోగ్య శాఖలో గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బీఆర్టీయూ అనుబంధంగా ఉన్న ఆశ వర్కర్ల సంఘం గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. తమకు భోజనం సక్రమంగా పెట్టకుండా వార్డెన్ వేధిస్తున్నారని ఆర్మూర్‌లోని బీసీ హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇతరులు తమతమ సమస్యలను వివరిస్తూ అర్జీలను అందజేశారు.

మార్పు కోసం ప్రశ్నించేతత్వం పెరగాలి



మాట్లాడుతున్న నర్రా రామారావు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): సమాజం మారాలంటే విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని బాలోత్సవ ప్రతినిధి నర్రా రామారావు అన్నారు. విద్యార్థులకు బోధించే విద్య వారు ప్రశ్నించేతత్వాన్ని పెంచడంతోపాటు మానవీయ విలువలు, పర్యావరణం, రాజ్యాంగ స్ఫూర్తిపై శాస్త్రీయంగా ఆలోచించేలా ఉండాలని, మార్పు కోసమే బాలోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మోపాల్ శివారులోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళ, బుధవారాల్లో ప్రెసిడెన్సీ స్కూల్‌లో బాలోత్సవం, చదువుల పండుగ కొనసాగనుందని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులకు రెండు రోజులపాటు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బ్లడ్ గ్రూపింగ్ వంటి మ్యాజిక్, మ్యూజిక్ నేర్పుతూ వారికి సర్టిఫికెట్లు, బ్యాగులు, గిఫ్టులు ఇస్తామని తెలిపారు. బాలోత్సవాలకు సహకరిస్తున్న వైద్యులు, సామాజికవేత్తలు, శ్రేయోభిలాషులు, ప్రత్యేకంగా ప్రెసిడెన్సీ స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమావేశంలో బాలోత్సవ ప్రతినిధులు రవీంద్రనాథ్ సూరి, పవన్‌కుమార్, కోయేడి నర్సింలు, ప్రమోద్, రామకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ హనుమంతు, అడిషనల్ కలెక్టర్లు

నిజామాబాద్‌అర్బన్: భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతోపాటు జిల్లా అధికారులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానాన్ని అమలు చేశారన్నారు. అబుల్ కలాం అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన పుట్టిన రోజైన ప్రతిఏడాది నవంబర్ 11న ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి నాగూరావు, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్)ను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ అన్నారు. టైలరింగ్ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు 30 రోజులపాటు కొనసాగే శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందజేస్తారన్నారు. ఇతర వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పాత కక్షలతో ఒకరిని హత్య చేసిన ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి సోమవారం తీర్పును వెలువరించారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2021లో శక్కర్‌నగర్ చౌరస్తా సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద పట్టణానికి చెందిన సయ్యద్ అజార్ అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన సతీశ్, అబ్దుల్ జావిద్ కల్లుసీసాతో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారని, బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాలు రుజువు కాడంతో నిందితులకు 5ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.


చోరీ కేసులో ఒకరి అరెస్ట్

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సిరికొండ అజయ్ అలియాస్ రంజిత్‌ను చోరీ కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘ భవనం తాళాలు పగులగొట్టి రూ.30 వేల విలువైన సౌండ్‌సిస్టంను అజయ్ ఎత్తుకెళ్లాడన్నారు. తాము వాహనాలను తనిఖీ చేస్తుండగా సౌండ్‌ సిస్టంను విక్రయించేందుకు వెళ్తూ రంజిత్ పట్టుబడ్డాడని ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట సమీపంలో ఉన్న జగ్గనిచెరువు వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహ కనిపించిందని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, వివరాలకు తమను సంప్రదించాలన్నారు.

బాసర రైల్వేస్టేషన్‌లో బాలుడు



ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు బాలుడిని వదిలి వెళ్లినట్లు ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం సాయంత్రం బాసర స్టేషన్‌కు చేరుకున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ కోచ్–6లో గుర్తు తెలియని వ్యక్తులు రెండేళ్ల బాలుడిని వదిలి వెళ్లారు. ఏడుస్తున్న బాబును గమనించిన రైల్వే పోలీసులు అతడి సంబంధీకులు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. చివరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. బాబు సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను (87126 58591) సంప్రదించాలని ఎస్సై సాయిరెడ్డి సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నగరంలోని అజాం కాలనీలోని ఐస్ ఫ్యాక్టరీ వద్ద మినీ ట్రక్కులో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. అఫ్సర్ అనే వ్యక్తికి సంబంధించిన 70 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్న అమీర్ మహ్మద్ అలియాస్ చావూస్ అదుపులోకి తీసుకుని బియ్యంతోపాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఇంట్లో గొడవపడి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన కర్నె శంకర్(30) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. మద్యానికి బానిసైన శంకర్ ఆదివారం సైతం మద్యం సేవించి భార్య మాధవి, తల్లి సావిత్రితో గొడవపడ్డాడు. చనిపోతానంటూ బెడ్‌రూంలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత కిటికీలో నుంచి చూడగా శంకర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడు గతంలోపలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు తాగాడని ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్యకు ఫోన్ చేసి చెరువులో దూకి..

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గౌరు ప్రదీప్(35) అనే వ్యక్తి ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. కొంత కాలంగా మద్యానికి బానిసైన ప్రదీప్ తరచూ భార్య మీనతో గొడవపడేవాడని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తాగిన మైకంలో చెరువు వద్దకు వెళ్లి భార్యకు ఫోన్ చేసి చెరువులో దూకాడని తెలిపారు. రాత్రి వేళలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రదీప్ ఆచూకీ లభించలేదని, సోమవారం ఉదయం మృతదేహం నీటిపై తేలిందన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



కాశీం(ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన మహ్మద్ కాశీం సోమవారం ఉదయం రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి పక్కన ఉన్న రైల్వే ట్రాక్ దాటి వెళ్లిన కాశీం తిరిగి ఇంటికి వస్తూ పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన కాశీం ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

టీటీపేట: మండల కేంద్రానికి చెందిన తోడేటి నర్సింలు(47) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఏఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. వరి కోయించేందుకు కుమారులతో కలిసి నర్సింలు సోమవారం పొలానికి వెళ్లాడు. కోత యంత్రం రాకపోవడంతో కుమారులు ఇంటికి వెళ్లిపోగా.. నర్సింలు రాత్రి వరకు వెళ్లలేదు. దీంతో ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పక్కనే చెరువులో మృతదేహం తేలింది. నర్సింలుకు గతంలో ఫిట్స్ వచ్చేదని చెరువులోకి స్నానానికి వెళ్లడంతో ఫిట్స్ వచ్చి అక్కడే మృతి చెందాడని భార్య లక్ష్మి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

రామారెడ్డి: మండల కేంద్రానికి చెందిన భవానీపేట రాజయ్య,(77) ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. ఆదివారం రాత్రి తన పొలం కౌలు చేస్తున్న కన్నాపూర్ తండాకు చెందిన భావ్‌సింగ్‌తో కలిసి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కుప్పలు పోసి ఆ తర్వాత భావ్‌సింగ్ ఇంటి ముందు అరుగుపై కూర్చొని తింటుండగా ఛాతినొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బాలనర్సవ్వ రాజయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధర్నా

- మద్దతు తెలిపిన డాక్యుమెంట్ రైటర్లు



కవిత కాంప్లెక్స్ వద్ద నినాదాలు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లపై కొర్రీలు విధించడాన్ని నిరసిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు సోమవారం కవితా కంప్లెక్స్ వద్ద ధర్నా చేపట్టారు. వారికి డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ మద్దతు పలికింది. ఈసందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు దుకాణాలను బంద్ చేశారు. అనంతరం రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రమేష్‌రెడ్డి, డీఆర్ ప్రసూనను కలిసి వినతిపత్రం అందజేశారు. సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ మధ్య కొంతకాలంగా కోల్డ్‌వార్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయాలంటే సబ్ రిజిస్ట్రార్ అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, నిబంధనల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయడంలేదని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరవధికంగా దుకాణాలను బంద్ చేస్తామన్నారు. ఇదే విషయమై డీఆర్ ప్రసూనను వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం 257 సర్క్యులర్ ప్రకారమే డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించిందన్నారు. ఆ నిబంధనల మేరకే సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లు చేస్తారని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా సోమవారం 18 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిసింది.

27 నుంచి ఆర్టీసీ కార్గో హోమ్ డెలివరీ



ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని ఏటీఎం కార్గో అధికారి పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు డిపో మేనేజర్ ఆనంద్‌తో కలిసి కార్గో సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్‌కి సంబంధించిన 30 కౌంటర్‌లలో(సిటీ పరిసరాలచుట్టూ) పార్సిళ్లను హోమ్ డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆర్మూర్ డిపో – 73968 89496, బోధన్ – 90142 96638, నిజామాబాద్ ఒకటో డిపో – 91542 98727, రెండో డిపో – 73968 89496, బాన్సువాడ 91542 98729, కామారెడ్డి – 91542 98729, ఆర్ఎం కార్యాలయం – 86399 63647 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఖైసర్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడలు



నిజామాబాద్‌నాగారం: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైసర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు రాజారాం స్టేడియంలో కొనసాగిన అథ్లెటిక్స్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. క్రీడాకారులను నుడా చైర్మన్ కేశ వేణు ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లు, మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జిల్లాకు చెందినవారితోపాటు హైదరాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి తదితర జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఖైసర్ స్వతహాగా గత కొన్ని ఏళ్లుగా క్రీడాకారులను ప్రోత్సహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జావీద్‌అక్రం, మోయిన్‌యూనిస్, హఫీజ్, లాయక్, నవాజ్, తేజబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఆక్రమణల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ నుంచి మామిడిపల్లి వరకు రోడ్డును ఆక్రమించిన ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు, షెడ్డులను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారుల సమక్షంలో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆటోలను సైతం రోడ్లపై నిలిపితే జరిమానా విధిస్తామన్నారు. బస్టాండ్ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ స్తంభించకుండా వ్యాపారులు, ఆటోవాలాలు సహకరించాలన్నారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.